www.navatelangana.com

నవతెలంగాణ

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

గురువారం 13 ఏప్రిల్ 2023

కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి

నవతెలంగాణ - కౌటాల

కరెంట్ స్తంభాలను రోడ్డుపై లాక్కెళ్తూ తీసుకెళ్లిన కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని ఎంపీటీసీ దుర్గం మోతిరాం డిమాండ్ చేశారు. బోదంపెల్లి గ్రామం నుండి గురుడుపేట గ్రామం వరకు ట్రాక్టర్‌కు కరెంటు స్తంభాలు కట్టి లాక్కెళ్లడంతో రోడ్డు చెడిపోయిందన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం రోడ్డు పాడైపోతుందని అధికారులకు చెప్పినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. వెంటనే సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.



పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ మండలంలోని కత్తెరసాల గ్రామానికి చెందిన మల్లవేన విజయ్(22) బుధవారం పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కుటుంబంలో మైనర్‌తో విజయ్ ఫోన్లో మాట్లాడుతున్నాడని అనుమానం పెంచుకున్నాడు. కేసు పెట్టి జైలుకు పంపుతానని వేధింపులకు గురి చేశాడు. తనపై వచ్చిన అపోహలు గ్రామంలో తెలిస్తే పరువుపోతుందని ఆందోళన చెందిన విజయ్ ఇంట్లోనే పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెన్నూరు పట్టణ సిఐ వాసుదేవరావు తెలిపారు.

కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు
- సిర్పూర్(యు)లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ - జైనూర్

ఎన్నో త్యాగాలతో పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో ముందుకు తీసుకెళ్లడం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. బుధవారం సిర్పూర్(యు) మండల కేంద్రంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు అధ్యక్షతన బీఆర్ఎస్ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దీనికి మాజీ పార్లమెంటు సభ్యులు గొడం నగేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావుతో కలిసి హాజరయ్యారు. ముందుగా మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తలు తమ సమస్యలను అతిథుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధించిన తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి రైతులకు ఎన్నో మంచి పథకాలను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ మండలాల్లో గిరిజన రైతులకు రైతుబంధు, రైతుబీమా, ఆసరా పెన్షన్ లాంటి పథకాలతో గిరిజనులు ఎంతో లాభం పొందుతున్నారని పేర్కొన్నారు. ఒంటరి మహిళలకు ఆసరా పెన్షన్ లాంటి పథకాలను ప్రవేశపెట్టడం గొప్ప విషయమన్నారు. గిరిజనులకు, గిరిజన దేవుళ్లకు ప్రాధాన్యత కల్పించి ప్రతి ఆలయం అభివృద్ధి కోసం నిధులు కేటాయించే ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని తెలిపారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన కొమురం భీం పేరుతో జిల్లాను ఏర్పాటు చేసి గిరిజన తండాలు, గూడాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనులకు సర్పంచ్‌లు అయ్యే అవకాశాలు కల్పించిన ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, సిర్పూర్(యు) జెడ్పీటీసీ కోవ అరుణ, ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తొడసం ధర్మారావు, సిర్పూర్(యు) మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వైఎస్ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్ డిమాండ్ చేశారు. కలెక్టర్ బోర్కడే హేమంత్‌కు పార్టీ తరపున వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీళ్ల, నిధులు, నియామకాల కోసం తెచ్చుకున్న తెలంగాణలో నేడు అధ్వాన పరిస్థితి నెలకొందన్నారు. పేపర్ లీకేజీలతో నిరుద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అనేకమంది పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత ఉన్నారని, వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వారందరికీ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గ ఇన్చార్జి పెద్దపల్లి కిషన్‌రావు, జిల్లా ఎస్టి విభాగ అధ్యక్షుడు మెస్రం నాగోరావు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు యాదవ్ సింగ్, జిల్లా కార్యదర్శి మహమ్మద్ షాకీర్ పాల్గొన్నారు.

కళ్యాణ తలంబ్రాలు భక్తులకు పంపిణీ



నవతెలంగాణ - కౌటాల

కార్గో ద్వారా భద్రాచలం నుండి వచ్చిన సీతారాముల కళ్యాణం తలంబ్రాలను కార్గో నిర్వాహకుడు దూస మహేశ్వర ప్రసాద్ భక్తులకు అందించారు. కార్గో ద్వారా కౌటాల నుండి ఎక్కడికైనా ఏ వస్తువైనా తక్కువ ధరలో, తక్కువ సమయంలో గమ్యస్థానాలకు భద్రంగా చేరవేస్తామన్నారు. అన్ని రకాల పార్సిల్, కొరియర్ సదుపాయం ఉందని, దీన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండలంలోని కమ్మర్‌గాం గ్రామంలో ఆశ్రమ పాఠశాలను తహసీల్దార్ సరిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటుచేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ గోపాల్, ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎక్కడి నిర్మాణాలు అక్కడే..!

- ముందుకు సాగని డబుల్ బెడ్‌రూమ్‌లు
- పనుల పూర్తికి ముందుకురాని గుత్తేదారులు
- బిల్లులు రాక..జీఎస్టీ భారంతో అయిష్టత
- ఏండ్లు గడుస్తున్నా పేదలకు దక్కని నివాసాలు
- దృష్టిసారించని పాలకులు, అధికారులు

డబుల్ బెడ్ రూమ్‌లు.. ఇది కొన్నేండ్ల నుంచి వినిపిస్తున్న మాట. అక్కడ కట్టారు..ఇక్కడ కట్టారు అనే మాటే కానీ పంపిణీ చేసింది లేదు. పనులు ప్రారంభించి ఏండ్లు గడుస్తున్నా నిర్మాణ దశలోనే ఆగిపోయాయి. వీటిని ఎప్పుడు పూర్తి చేస్తారు..ఎప్పటిలోగా అవుతాయి. ఎవరు పూర్తిచేస్తారనేది తెలియడం లేదు. నిర్మాణాలు ప్రారంభించిన గుత్తేదారులు బిల్లులు సకాలంలో బిల్లులు రాకపోవడం మూలంగా అర్ధాంతరంగా పనులు ఆపేశారు. అధికారులు మళ్లీ టెండర్లు పిలిచి పనులు అప్పగిద్దామంటే ఎవరూ ముందుకు రాకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది జిల్లాలోని డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాల పరిస్థితి. జిల్లా, మండల కేంద్రాలతో పాటు కొన్ని పల్లెల్లో చేపట్టిన ఈ ఇండ్ల నిర్మాణాలు ఎన్నేండ్లు గడుస్తున్నా పూర్తికావడం లేదు. ఒకటి, రెండు చోట్ల తప్పితే ఎక్కడా లబ్దిదారులకు పంపిణీచేసిన దాఖలాలు కనిపించడం లేదు. పాలకులు, అధికారులు సైతం వీటి పురోగతిపై దృష్టిసారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పేదలకు గూడు కల్పించేందుకు ప్రభుత్వం రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5.04లక్షలు కేటాయించింది. ఆదిలాబాద్ జిల్లాలో 3579 ఇంటి నిర్మాణాలకు పరిపాలన అనుమతులు మంజూరు కాగా 2291 ఇండ్లకు మాత్రమే టెండర్లు ఖరారయ్యాయి. ఇందులో ఇప్పటి వరకు కేవలం 606 ఇండ్లకు మాత్రమే నిర్మాణాలు పూర్తిచేసుకోగా మిగిలిన అన్ని ఇండ్లు అసంపూర్తి దశలోనే ఉండిపోయాయి. ఇండ్ల కోసం కేటాయించిన మొత్తం వ్యయం రూ.129.45కోట్లలో ఇప్పటి వరకు రూ.89.08కోట్లు ఖర్చు చేశారు. మిగితా ఇండ్లతో పాటు బిల్లులు రావాల్సి ఉంది. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్‌శాఖ ద్వారా 2420 ఇండ్లకు పరిపాలన అనుమతులు రాగా 1132 ఇండ్లకు టెండర్లు ఖరారు కాగా ఇప్పటి వరకు 410ఇండ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఇందుకు 29.68కోట్లు ఖర్చు చేశారు. పట్టణ ప్రాంతంలో రోడ్లు భవనాలశాఖ ద్వారా 982ఇండ్లకు గాను 982ఇండ్లకు మాత్రమే టెండర్లు ఖరారయ్యాయి. ఇందులో 100ఇండ్లు నిర్మాణం పూర్తిచేసుకోగా 882 ఇండ్లు చివరి దశలో ఉన్నాయి. రూ.50.43కోట్లు ఖర్చు చేశారు. ఐటీడీఏ పరిధిలో 177ఇండ్లకు గాను అన్నింటికీ టెండర్లు ఖరారయ్యాయి. ఇందులో 90ఇండ్లు పూర్తికాగా రూ.8.96కోట్లు ఖర్చు చేశారు.

పూర్తయ్యేదెప్పుడో..?

ఆదిలాబాద్ జిల్లాలో చేపట్టిన డబుల్‌బెడ్‌రూంల నిర్మాణం ఇప్పట్లో పూర్తికావడం అనుమానంగా మారింది. ఎందుకంటే ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి కేవలం రూ.5.04లక్షలు కేటాయించడం సిమెంటు, ఇటుక ధరలు పెరిగిపోయిన తరుణంలో ఈ నిధులతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయడం గుత్తేదారులకు కష్టంగా మారుతోంది.



గుడిహత్నూర్‌లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు

మరోపక్క చేసిన పనులకు సంబంధించి బిల్లులు కూడా సకాలంలో రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని కష్టాలు భరించి పనులు చేపడుతామని భావించినా ప్రభుత్వం జీఎస్టీ రూపంలో 18శాతం వసూలు చేస్తోంది. రూ.5.04నిధుల్లో 18శాతం అంటే సుమారు రూ.90వేలు జీఎస్టీ రూపంలో ప్రభుత్వానికే చెల్లించాల్సి వస్తోంది. ఇక ఇంటి నిర్మాణానికి మిగిలేది ఏమీ ఉండదనే ఉద్దేశంతోనే గుత్తేదారులు అయిష్టత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు పలుమార్లు టెండర్లు పిలిచినా ఇందులో పాల్గొనేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఈ కారణంగానే డబుల్ బెడ్ రూం ఇండ్లు ముందుకు సాగడం లేదనే విమర్శలున్నాయి.

నిరుపేదల ఎదురుచూపులు..!

సొంతింటి కోసం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మంది నిరుపేదలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే మండల కార్యాలయాలు, జిల్లా కేంద్రాల్లో అధికారులకు దరఖాస్తులు అందజేశారు. తమకు ఇండ్లు వస్తాయనే భరోసాతో ఏండ్లుగా ఎదురుచూస్తున్నారు. కానీ వారి ఆశలు అడియాశలే అవుతున్నాయి. నిర్మాణాలు పూర్తికాకపోవడం.. పూర్తయిన వాటిని పంపిణీ చేయకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏండ్ల నుంచి ఇరుకు గదుల్లో నివసించడం.. పట్టణాల్లో అద్దె చెల్లించలేక అవస్థలు పడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. మరోపక్క ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.3లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించింది. కానీ వీటికి సంబంధించి మార్గదర్శకాలు జారీ చేయడంలో జాప్యం జరుగుతుండటంతో ఎప్పటి వరకు వస్తాయో అధికారులకు కూడా తెలియని పరిస్థితి ఉంది.

టెండర్లు పిలుస్తున్నాం : మహవీర్, పంచాయతీరాజ్,ఈఈ

జిల్లాలో అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇండ్లను పూర్తి చేసేందుకు టెండర్లు పిలుస్తున్నాం. కానీ గుత్తేదారులు ముందుకు రావడం లేదు.ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.5.04లక్షలు కేటాయించింది. వీటితో పాటు జీఎస్టీ రూపంలో 18శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఈ కారణంగానే నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకురావడం లేదని తెలుస్తోంది.

కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ - బెజ్జూర్

నాలుగేండ్ల కాలపరిమితి పూర్తయిన తమను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని కార్యదర్శులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో కార్యదర్శులు నాలుగేండ్ల కాలపరిమితి పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ జెడ్పీటీసీ పుష్పలతకు, ఎంపీడీఓ మాధవికి, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులతో నాలుగేళ్ల నుండి గ్రామాభివృద్ధి కోసం వెట్టిచాకిరి చేయించుకుంటోందన్నారు. సమస్యలను పరిష్కరించడంలో ఆసక్తి చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ చేస్తామని సీఎం ఆశలు రేకెత్తించడమే తప్ప చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. మూడేళ్లు పూర్తిచేసుకున్న కార్యదర్శులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి ఏడాది గడువు పెంచారని, ఇప్పటికైనా తమను రెగ్యులర్ చేసి ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

సిర్పూర్(టి) : రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల నుండి గ్రామాభివృద్ధి కోసం గొడ్డుచాకిరి చేయించుకుంటూ పర్మినెంట్ ఊసెత్తడం లేదని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ రాజేశ్వర్‌కు, ఎంపీఓ మహేందర్‌రెడ్డికి, సిర్పూర్ గ్రామ పంచాయతీ ఈఓ కృష్ణమూర్తికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రొబేషనరీ కాలపరిమితి పూర్తకావడంతో రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని గ్రామస్థాయిలో రేయింబవళ్లు కష్టపడి అమలు చేస్తున్నామన్నారు. దీని ఫలితంగా గ్రామాలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు వచ్చాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నాలుగేండ్ల గడువు పూర్తయినప్పటికీ రెగ్యులర్ విషయంలో ఎటువంటి ఉత్తర్వులు వెలవడనందున కమిషనర్‌కు ఈ నెల 13న సమ్మె నోటీసు ఇచ్చి 15 రోజుల గడువు ఇస్తామని తెలిపారు. దీనికీ స్పందించని పక్షంలో 28 నుండి నిరవధిక సమ్మెకు వెళ్లాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ఇప్పట్నుండి 28 వరకు వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతామన్నారు. కార్యక్రమంలో 16 గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.



సిర్పూర్(టి)

పెంచికల్‌పేట్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగేండ్ల ప్రొబేషనరీ కాలం పూర్తయిన సందర్భంగా నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా రెగ్యులరైజ్ చేయాలని ఎంపీడీఓ గంగాసింగ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. సీపీఎస్ఎఫ్ కమిటీ నిర్ణయం మేరకు ఈ నెల 28 నుండి నిరవధిక సమ్మె చేయడానికి నిర్ణయించామని కార్యదర్శులు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, రాకేష్, బాపురావు, చంద్రశేఖర్, కిట్టయ్య పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగు సంవత్సరాల ప్రొబేషనరీ కాలం పూర్తయిన సందర్భంగా రెగ్యులర్ చేయాలని ఎంపీడీఓ మహేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో 28 నుండి సమ్మెకు దిగుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, జడ్పిటిసి డుబ్బుల శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జైనూర్ : పంచాయతీ కార్యదర్శుల కృషితోనే గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయని లింగాపూర్ ఎంపీడీఓ ప్రసాద్, ఎంపీఓ ఉమర్ షెరీఫ్ అన్నారు. బుధవారం జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ నాలుగేండ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ శాఖ అధికారులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం శాలువాలతో కార్యదర్శులను సన్మానించి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో జైనూర్ ఎంపీడీఓ ప్రభుదయ, వైస్ ఎంపీపీ చిర్లె లక్ష్మణ్, సర్పంచ్ జాదవ్ పద్మనాను, మూడు మండలాల జూనియర్ కార్యదర్శులు శ్రీనివాస్, సాగర్, ఇర్ఫాన్, సోయం దేవ్‌రావు పాల్గొన్నారు.



జైనూర్

'అంతర్లీన' ఆమె హృదయాంతరంగం



సమాజంలోని సమకాలీన సంఘటనలు హృదయ స్పందనలు కలలు అలలుగా అలరించి అనుభవాల అనుభూతులు జ్ఞాపకాల ప్రభావంతో అంతర్లీనంగా అల్లుకొన్న అక్షరాలే 'అంతర్లీన' సంపుటం. యాభైఐదు వచన కవితలతో అంకురించిన తొలి కవిత సంపుటి పాఠక లోకానికి అందించిన కవయిత్రి అడ్డగూరి శ్రీలక్ష్మి, వృత్తిరీత్యా ఈమే ప్రభుత్వ ఉపాధ్యాయులైనప్పటికీ తెలుగు సాహిత్యంపై మక్కువతో విద్యార్థి దశ నుండి కవిత్వం రాయాలని ధ్యాస కలిగి వుండటం అభినందనీయం.

కదులుతున్న కాలంలో సమాజంలో జరుగుతున్న విషాద పరిణామాలు, వివక్షత, దగా, సమాజ అంతరాలకు చలించిపోయి భిన్నమైన కవిత వస్తువులతో అక్షర రూపమిచ్చిన కవయిత్రి ఈమె. కవిత్వం చదువుతున్నంత సేపు హృదయాంతరాల్లోని అలజడులు కడలి కెరటాల్లాగా ఎగిసి పడుతున్నప్పుడు ఒడ్డుకు తగిలే చినుకులు మేనును స్పృశిస్తే, కలిగే అనుభూతి అక్షరాలు పద బంధాలైనప్పుడు మనసును మురిపిస్తాయి. లోకంలోని ప్రతి విషయానికి కవయిత్రి ఎంతగా స్పందించిందో ఒక్కొక్క కవిత పరిశీలిస్తే బోధపడుతుంది. 'కవి మనసు' కవితలో...ఆకలి చూపుల ధైర్యంలా ఓ తీరు/ అమ్మ హృదయ పూర్వక ప్రేమలా ఓ మారు/ అణగారిన వర్గపు ఆక్రందనలా ఓ తీరు/ సమాజంలో క్షుద్బాలా, మాతృ ప్రేమలా, అణగారిన వర్గాల ఆక్రందనలా కవి మనసు మారితే భాషను భావంగా మలచి భావితరాలకు దారి చూపే మార్గదర్శిగా కవిత్వాన్ని అభివర్ణించారు శ్రీలక్ష్మి. 'పె(గ)న్' కవితలో...అక్షరాల్ని ఆయుధాలుగా/ ప్రశ్నించే ఆయుధాలుగా/ సమాజ దుర్గతుల్ని ప్రశ్నిస్తూనో / నైతిక విలువలను శోధిస్తూనో/ అక్షరాలని బుల్లెట్లుగా నింపి/ సమాజంలోని అన్యాయం అక్రందనల మీద అక్షరాయుధాలుగా ప్రశ్నించే గొంతుక కవి కావాలన్నారు ఆమె. పెన్ను గన్‌గా మార్చి అక్షరాలు బుల్లెట్లుగా నింపే కవి కలం గొప్పతనాన్ని చాటారు. 'అలు పెరుగని అల' కవితలో గడియారం ముల్లులా/ ఆమెకి నిమిషం కూడా తీరిక ఉండదు.. గుమ్మతనం అమ్మతనం/ ఆలితనం అమ్మోరితనం/ ఆదిశక్తి అంశ పుణికి/ పుచ్చుకుందేమో.. గడియ తీరిక లేని గడియారం ముల్లులా సంసార సాగరాన్ని ఈదుతూ అమ్మతనం చూపే మహిళ ఒక ఆదిశక్తిలా కవయిత్రి వర్ణించింది. ఆటుపోట్లు అగచాట్లు ఆమె ఆత్మస్థైర్యం ముందు తోక ముడుస్తుందని కితాబిచ్చారు. సహజమైన యతి ప్రాసలతో అక్షర రూప మిచ్చి ఆకట్టుకునేలా మహిళ శక్తి సామర్థ్యాలను అభివర్ణించింది. 'మరపు ప్రయాణం' కవితలో... జ్ఞాపకాలు నేర్పిన పాఠాలు/ ముల్లెగట్టుకు...వయస్సు/మరో మెట్టు ముందుకెళుతూ...ఆయుష్షు మరో మెట్టు వెనక్కి వెళుతూ.../ జీవిత యానంలో మరువలేని గతపు జ్ఞాపకాలు గుర్తుకొచ్చినప్పుడు కలవరపెడుతుంటాయని మరికొన్ని వదలకుండా వుంటాయని అవి ముల్లెగట్టుకొని జీవితం ముందుకెళ్తుంటుంటే..ఆయుస్సు కొవ్వత్తిలా కరిగి పోతుందని ఆమె ఆవిష్కరించారు. 'కలల తీరం' కవితలో...కాలంతో పరుగీడుతూ గగనంలో విహరించి, పరిశోధించే కలల్ని పండించాలని కృతమైన ఆవిష్కృతమైన సాధించాలంటారు. నిత్యం సాధన చేస్తూ నిర్విరామ కృషితో విజయపథం చేరానికి భావి తరాలను నిర్దేశిస్తోంది ఈమె. 'విడిచేయి విడిచేయి' కవితలో తొక్కే మూకల../ ఒర్రె కాకుల.. కుక్కలా/ పడి ఉంటావా ఒకరి పెత్తనం.. నిను నడిపిస్తే తోక ఊపుతూ ఉంటావా../ ఎవరి సత్తువ ఏమిటో/ తెలిపే సింగమై గర్జిస్తావా..బానిసత్వాన్ని వదిలేసి మనోనిబ్బరంతో స్వేచ్ఛ జీవిగా బతకాలని, ఒకరి పెత్తనం ముందు శునకంలా పడి వుంటావెందుకని నిలదీస్తది. సింహమై గర్జించి మీ సత్తువ చాటాలని శ్రీశ్రీ కవితా ధోరణిలో సమరశీల చైతన్యాన్ని నింపుతది శ్రీలక్ష్మి. 'స్త్రీ' కవితలో సృష్టికర్త అయిన స్త్రీ మూర్తికి దేశంలోనైనా విదేశాల్లోనైనా ఉద్యోగి ఐనా గృహిణి ఐనా అస్తిత్వం కోసం అగ్నికణమై మండి పోవాలని వివక్షత లేని సమాజంలో ఆమె ఔన్నత్యాన్ని చూడాలని అకాంక్షిస్తూ మహిళా పక్షపాతిగా నిత్యం జరిగే స్త్రీ జాతి సంఘర్షణలను చూసి చలించి నిర్హాంతమై పోతది కవయిత్రి. 'సవ్వడి చేయని కన్నీళ్లు' కవితలో బాధపడ్డ మనసు భారమైనప్పుడు అనుకోకుండా కన్నీళ్లు ఉబికి వస్తాయని/ శబ్దం చేయని కన్నీళ్ల ఎన్నో విషయాలు చెప్పుతుంటాయని/ మనిషి యొక్క ఆర్ద్రతను అద్వితీయంగా కవిత్వీకరించారు. 'నిషా' కవితలో మత్తుకు బానిసైన వారి జీవితాలతో చెలగాటం ఆడుకుంటారని ఆరోగ్యం క్షీణించి ఇంటిల్లాదులు బాధల బందిల్లో బలైపోతున్నారని ఈ కోవకు చెందిన వారు మేల్కొనాలని ఆమె హితవు పలికారు. 'జ్ఞాపకం' కవితలో...కొన్ని జ్ఞాపకాలు అనుభూతులను పందిళ్లయి కళ్ళలో కలల్లా అలలాడుతుంటాయని సంధ్యా సమయంలో అలసిన మనసును సేద తీర్చి అలిగిన మదికి హాయినిచ్చే వెన్నెల్లో కురిసే మంచు పువ్వుల్లా జ్ఞాపకాలుంటాయని అవి మదిలో చెదిరిపోని చేవ్రాలవుతాయని తన అంతరంగాన్ని ఆనందభరింతంగా వ్యక్తీకరించారు శ్రీలక్ష్మి. 'భాషణమే భూషణం' కవితలో మాట గొప్పదనాన్ని వివరిస్తూ నోరు చల్లగా ఉంటే.. ఊరంతా చుట్టాలే! అనే చందంగా ఎదుటి వారితో మాట్లాడే మాట విధానం గురించి ఆమె వివరించారు.'నా కవనం'లో వెన్నెల్లో స్పృశిస్తూ/ కన్నీళ్లను వర్షిస్తూ/ విలువలను వివరిస్తూ/ వలవల వర్షిస్తూ/ అరుణాని ఆక్రందిస్తూ/ ఆర్తిని ఆహ్వానిస్తూ/ నా కవితాప్రయాణం ఆగదని దృఢవిశ్వాసంతో సాహిత్య పిపాసిగా కవయిత్రి ప్రకటించారు. 'మహిళా' కవితలో మహాకవి శ్రీశ్రీ కవితను అనుకరించి తనదైన శైలిలో పురుషాధిక్యా సమాజంలో తమ హక్కుల కోసం కదం తొక్కాలని అణచివేతలను ఎదురేగి మౌనం వీడి ధిక్కార స్వరాన్ని వినిపించాలని మహిళలు ఎదుర్కొంటున్న సంఘటనలపై వారిని జాగృతం చేసే విధంగా మహిళా లోకం ప్రశ్నించే దిశగా సంసిద్ధం కావాలని ఈమె ధైర్యాన్ని నింపి పోస్తోంది. 'నేస్తమా' కవితలో స్నేహాన్ని మించింది జగతిలో ఏమి లేదని స్నేహితుల మధ్య ఏర్పడే పొరపచ్చాల్ని అపార్థాల్ని విడనాడి తమలోని అహాన్ని తగ్గించుకోవాలని మర్చిపోలేని యాదిని అభిమానాన్ని వెతుక్కోవాలని చెలిమి చేసే స్నేహితులకు హితం పలికారు. 'ఏకాంతం' కవితలో...మనసు ఊగిసిలాడుతున్నప్పుడు నిత్యజీవన గమనంలో ఊతమిస్తూ హాయ్ నిస్తూ ఆత్మ విమర్శలో నిజానిజాలు కనుగొంటూ ఏకాంతం తోడు నీడగా ఆత్మస్థైర్యమిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. 'అసహనం' కవితలో...కండ బలంతో గుండె నిబ్బరంతో పుడమి తల్లిని నమ్ముకున్న రైతన్నకు అతివృష్టి అనావృష్టి అకాల వర్షాలతో అష్ట కష్టాలకోర్చి అందరికీ అన్నం ముద్దబెట్టే అన్నదాతకు మంచి రోజులు రావాలని శ్రీలక్ష్మి ఆకాంక్షించారు. 'నేటి బాలలే రేపటి పౌరులు' కవితలలో ఈమె ఎలాగు విద్యార్థులకు విద్యా బుద్ధులు చెప్పే ఉపాధ్యాయురాలు గనుక నేటి పసి పిల్లలే భావి భారత పౌరులని వారిని సంస్కారవంతులుగా విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని తాను ఆకాంక్షించారు. అనుభూతులు సాక్షాత్కారించినప్పుడు అక్షర గీతమై వీనుల విందు చేస్తానని తన కవన ప్రవాహం గురించి అంతరంగాన్ని ఆమె బహిర్గతం చేశారు. అల్లరి చేష్టలు అమాయక మాటలతో అరమరికలు లేని అందమైన బాల్యమంటూ 'అల్లరి మల్లరి' కవితలో తిరిగిరాని బాల్య జీవితం గురించి వివరించారు. 'కొందరు యువకులు' కవితలో కళ్ళున్నా కబోదుల్లా.. కాళ్లున్నా అవిటి వాళ్ళలా.. నేటి యువతరంలో సామాజిక స్పృహ లేదని ఆమె ఆవేదన పడుతోంది. సమాజంలోని చెడును ఎదిరించని బలహీనులు, గాల్లో తిరిగి పబ్బం గడుపుతూ.. దున్నపోతుల్లా తిరిగే వారిని కన్నా ఫలం లేదన్నట్లు ఇలాంటి వారు భూమికి భారమని శ్రీలక్ష్మి అసహ్యయించుకొని ఆవేదన చెందుతోంది. 'రస గీతిక' కవితలో మనసు



పరవశించి పోయినప్పుడు ఉహా కలల్లో తేలిపోయి కవన గీతికనై పోతానని పరవశించి పోతారు ఆమె. 'కార్మికుడు' కవితలో సమాజంలో శ్రామిక శక్తిని కొనియాడుతూ కార్మిక వర్గ పక్షపాతిగా అభ్యుదయ కాలం వస్తుందని ఆశాభావాన్ని వెల్లడించారు. ప్రకృతిని విధ్వంసం చేస్తూ నోట్ల వెనుక మనిషి పరిగెడుతుంటే! సూక్ష్మ జీవి దాడిని తట్టుకోలేని లోకం నేడు ప్రకృతి సమతుల్యం పాటించే సమయం ఆసన్నమైందని.. కరోనా నేర్పిన గుణ పాఠాల్ని పునరుద్ఘటించారు. 'కాలచక్రం' కవితలో పగలు రేయి కాలచక్ర భ్రమనంలో కొన్ని జీవిత చిత్రాలు రమణీయంగా మరికొన్ని కమనీయంగా కొన్ని విషాద భరితంగా చిత్రవిచిత్రాలుగా ఆవిష్కృత మవుతాయని మనిషి గమ్యం లక్ష్యాన్ని కాలమే నిర్ణయిస్తుందని తాత్విక ధోరణిలో ఆమెఅంతరంగాన్ని వెల్లడించారు. 'అహం' కవితలో లోకం నన్ను ఏ రీతిలో చూసినప్పటికీ నా అస్థిత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవడానికీ ఎప్పుడు సంసిద్ధంగా వుంటూ ముందుకు వెళ్తానని గుండె ధైర్యంతో తన దృఢ సంకల్పాన్ని స్పష్టికరించారు. అంతర్లీనాన్ని అడుగు దాక చూసినట్లయితే! కవయిత్రి హృదయ స్పందనలు, మానసిక సంఘర్షణ, అధ్యాత్మిక చింతనతో కూడిన భావాత్మకత బయట పడుతోంది. ఈ సంపుటిలోని కవిత్వం వస్తుశిల్పం రమణీయంగా రూపుదిద్దుకున్నది. వర్తమాన కాలంలో ఏ మార్గంలో పయనించాలో కవులు కవయిత్రులు గ్రహించవలసి ఉంది. మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా జన చైతన్యం పరచే విధంగా వచన కవిత్వం వుండాలి. సాహిత్య ప్రాస్థానంలో తొలి అడుగువేసి అంతర్లీన కవిత సంపుటిని అడ్డగూరి శ్రీలక్ష్మి మన అందరి ముందుంచడం అభినందనీయం.



బొల్లారపు బాబన్న
9440654583

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైందని వైయస్సార్ తెలంగాణా పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్ కుమార్ అన్నారు. పార్టీ అధినేత్రి షర్మిల ఆదేశాల మేరకు నిరుద్యోగుల సమస్యలపై కలెక్టర్ రాహుల్ రాజ్‌కు బుధవారం పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు పెందుర్ మనోహర్, పట్టణ అధ్యక్షులు రాహుల్‌రెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షులు అస్లం, ఎస్టి సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెస్రం శంకర్, జిల్లా యువజన నాయకులు కన్నాజి కృష్ణంరాజు, విద్యార్థి విభాగం అర్జున్, ఆదిలాబాద్ మండల అధ్యక్షుడు మానిక్‌రావు, అర్జున్, కృష్ణ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్

గురువారం 13 ఏప్రిల్ 2023

సజావుగా మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఇచ్చోడ

ఎంపిడిఓ సమావేశ మందిరంలో ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపిడిఓ రాంప్రసాద్ అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. మండలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు జరుగుతున్న పనులను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని గడువులోగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో అధికారులు పర్యటించి తాగునీటి సమస్య పరిష్కరించాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రామారావు, ఎంఈఓ ఉదయ్ రావు, ఎంపిటిసిలు గాడ్గే సుభాష్, శివకుమార్‌రెడ్డి, సుజాత, సర్పంచులు చౌహాన్ సునీత, పాండురంగ్, మాధవ్, సుభాష్ పటేల్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో ఆడబిడ్డలకు పెద్ద పీట

- ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



నవతెలంగాణ-ఇచ్చోడ

రాష్ట్రంలో అమలు అవుతున్న ప్రతి సంక్షేమ పథకంలో అడబిడ్డలకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 106 మంది పేదింటి అడబిడ్డలకు, షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడపిల్లల బతుకుల్లో ఆత్మీయ మేన మామల కేసీఆర్ వెలుగొందుతున్నారని తెలిపారు. కడుపు నింపుకోవడానికి కాయ కష్టం చేసే ఎన్నో పేదింటి కుటుంబాలు నేడు సంతోషంతో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, సర్పంచ్ సునీత, మాజీ కన్వీనర్ మెరాజ్ హమ్మద్, బీఆర్ఎస్ అధ్యక్షులు ముస్తఫా, ఎంపీటీసీ గాడ్గే సుభాష్, రాథోడ్ ప్రవీణ్, షబీర్, కడమంచి భీముడు, సురేందర్‌రెడ్డి, రాథోడ్ ప్రకాష్ పాల్గొన్నారు.

టీఎస్‌ఆర్జేసీ సెట్-2023కు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు టీఎస్ ఆర్జేసి సెట్ - 2023కు ఏప్రిల్ 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ టామ్నె ప్రణీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సిహెచ్ రమణకుమార్ ఆదేశాల మేరకు మే 6న ఉమ్మడి ఆదిలాబాద్ ప్రధాన కేంద్రాలలో పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసి, గ్రూపులకు ఆంగ్ల మీడియం జూనియర్ కళాశాలల్లో ప్రవేశం పొందడానికి ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వివరాలకు 040-24734899 ఫోన్ నెంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు భూమిపూజ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల దాహం తీర్చేందుకు వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయడం జరిగిందని జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో రూ.5లక్షల జడ్పీ నిధులతో ప్లాంటు, బోర్‌వెల్‌కు భూమి పూజ చేశారు. త్వరలోనే విద్యార్థుల సౌకర్యార్థం మినరల్ వాటర్ ప్లాంటు అందుబాటులోకి తెస్తామన్నారు. రాష్ట్రంలోనే 100 శాతం ఫలితాలు సాధిస్తున్న ఈ పాఠశాలలో వెయ్యికి పైన విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు. తాను గతంలో పాఠశాలను సందర్శించినప్పుడు అదనపు తరగతులతో పాటు వాటర్ ప్లాంటును మంజూరు చేయాలని విద్యార్థులు విన్నవించడంతో హామీ నెరవేర్చానని తెలిపారు. భూమి పూజలో సర్పంచ్ కొరెంగ గాంధారి, జడ్పీటీసీ పుష్పలత, ఎంపీపీ పి.శోభ, జిల్లా కో ఆప్షన్ సభ్యులు అమ్జద్, సోఫియాన్, పిఎసిఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, హెచ్‌ఎం గోపాల్‌సింగ్ తిలావత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్ర గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు ఏఈ రోహిదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ పెండింగ్ బిల్లులు, మీటర్లు, కేసులు తదితర సమస్యలుంటే పరిష్కరించుకోవాలని కోరారు. నిజామాబాద్ నుండి ఉన్నతాధికారులు వస్తున్నారని తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలి

- ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా క్రీడాకారులు తమ ప్రతిభతో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిట్ల రాజేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శి క్రీడా ప్రాంగణంలో బుధవారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అండర్-20 విభాగంలో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా వంద మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేసి ఈనెల 15, 16 తేదీల్లో హన్మకొండలో నిర్వహించే 21వ ఫెడరేషన్ కప్ రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. అనంతరం క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ఎంపిక ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన గిరిజన క్రీడల అధికారి పార్థసారథి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ అథ్లెట్లు ప్రతిభ చాటి జిల్లాకు పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జ్యోతిశ్వరన్, పీడీలు పీఈటీలు సందీప్, అలివేలుమంగ, విజిఎస్ రాకేష్, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

డయల్ 100ను విరివిగా వినియోగించాలి

- నెలవారి నేర సమీక్షలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా ప్రజలు డయల్ 100ను విరివిగా వినియోగించాలని ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో ఎస్పీ అధ్యక్షతన నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో గత నెలలో జరిగిన నేరాలపై, కేసుల నమోదు వాటి స్థితిగతులు, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై త్వరితగతిన పరిశోధన పూర్తి చేసి త్వరగా నేరస్తులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా విచారణ పూర్తి చేయాలని ఎస్పీ సూచించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా సాయుధ బలగాలతో కూడిన రెండు హైవే పెట్రోలింగ్‌లను ప్రతిరోజు క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, ఎస్ఐ స్థాయి అధికారిని పర్యవేక్షించే విధంగా ఉండాలని సూచించారు. అన్ని పోలీస్‌స్టేషన్లో ఉన్న 16 వర్టికల్స్ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ల వారిగా ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రతి గ్రామంలో సిసిటీవీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా గ్రామ ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రజలలో డయల్ -100పై అవగాహన కల్పించి ప్రజలందరూ డయల్ -100ను విరివిగా వినియోగించే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్క ఫిర్యాదుదారు ఫిర్యాదును స్వీకరించి బాధితునికి త్వరితగతిన న్యాయం చేకూర్చే విధంగా సిబ్బందిని కేటాయించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించాలని రిసెప్షన్ సెంటర్స్ పోలీసు సిబ్బందికి తెలియజేస్తూ వారిని నిరంతరం పర్యవేక్షిస్తుండాలని తెలిపారు. పట్టణంలో ప్రతిరోజు రాత్రి సమయంలో అన్ని ప్రదేశాలను సందర్శిస్తూ నిరంతర గస్తీని నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత నెలలో 16 వర్టికల్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మంది సిబ్బందికి, 3 నెలలలో వివిధ అంశాలలో ప్రతిభ కనబరిచిన 8 మంది పోలీసు అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో కె పురుషోత్తం - రెండవ పట్టణ సీఐ - డ్రంక్ అండ్ డ్రైవ్ కేసెస్, కే సత్యనారాయణ - ఒకటవ పట్టణ సీఐ - ఎస్ హెచ్ ఓ వర్టికల్, కే రవీందర్ - ఎస్ఐ బోథ్ 2 - ఎస్ హెచ్ ఓ వర్టికల్, ఎల్ ప్రవీణ్ - ఎస్సై గుడిహత్నూర్ - డ్రంక్ అండ్ డ్రైవ్ కేసెస్, ఎన్ నాగనాథ్ - ఎస్సై ఆదిలాబాద్ రూరల్ - ఇన్వెస్టిగేషన్ వర్టికల్, బి పెర్సిస్ - ఎస్సై జైనథ్ - ఇన్వెస్టిగేషన్ వర్టికల్, డి సునీల్ - ఎస్సై ఇంద్రవెల్లి - 5 ఎస్ వర్టికల్, డి రాధిక - ఎస్సై భీంపూర్ - ఎస్‌హెచ్‌ఓ వర్టికల్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎస్ శ్రీనివాసరావు, బి రాములు నాయక్, సి సమైజాన్ రావు, డీఎస్పీలు వి ఉమేందర్, సిహెచ్ నాగేందర్, పి శ్రీనివాస్, సిఐలు కే పురుషోత్తం, కే సత్యనారాయణ, బి రఘుపతి, కే నరేష్, ఐ సైదారావు, మల్లేష్, ప్రేమ్ కుమార్, నరేష్, అశోక్, జె గుణవంతరావ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి వెంకటి, బి శ్రీపాల్ పాల్గొన్నారు.

యూటీ నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు

- లాంఛనంగా పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

గడిచిన వర్షాకాలంలో శిథిలమైన సదర్‌మాట్ కెనాల్ యూటీ నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం రూ.5కోట్లు మంజూరు చేసింది. పనులను ఎమ్మెల్యే రేఖానాయక్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. వర్షాకాలంలో పాతెల్లాపూర్ గ్రామ సమీపంలో సదర్‌మాట్ కెనాల్ ఇరువైపుల కట్టలు కోతకు గురై అండర్ టన్నెల్ శిథిలమైంది. దీంతో ఖరీఫ్‌లో దిగువ రైతులు పంట సాగు చేసుకోలేకపోయారు. రైతులు రెండవ పంట నష్టపోవద్దన్న తలంపుతో ఎమ్మెల్యే సూచన మేరకు నీటిపారుదల అధికారులు రూ.14లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేసి రబీ సాగుకు నీరు వదిలారు. వరి పంట ప్రస్తుతం చిరుపొట్ట దశలో ఉంది. వరికోతలు పూర్తయ్యేదాకా పనులు జరిగే అవకాశం లేనందున ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. రబీ పంటకాలం పూర్తయిన వెంటనే పనులు మొదలుపెట్టి వచ్చే ఖరీఫ్ నాటికి యూటీ నిర్మాణం పూర్తిచేయాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ డీఈ సురేందర్, సదర్‌మాట్ జేఈ ఉదయ్, సత్తనపెల్లి పీఏసీఎస్ చైర్మన్, అమంద శ్రీనివాస్, నాయకులు వెంకాగౌడ్, రామునాయక్, ధర్మరాజు, కొప్పుల రాజేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమాజంలో న్యాయ వ్యవస్థ కీలకం : ఎంపీ

- బార్ అసోసియేషన్ నూతన సభ్యులకు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జిల్లా బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా మళ్లీ ఎన్నికైన ఎర్రాల నగేష్‌తో పాటు నూతన కార్యవర్గ సభ్యులను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ సోయం బాపూరావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ బార్ అసోసియేషన్ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా సోయం బాపురావు మాట్లాడుతూ సమాజంలో న్యాయ వ్యవస్థ కీలకమైందని, మానవతా దృక్పథంతో పనిచేసే న్యాయవాదులు ఉన్నంతవరకు న్యాయమే గెలుస్తుందని అన్నారు. పాయల్ శంకర్ మాట్లాడుతూ బాధితుల పక్షాన ఉంటూ వారికి న్యాయం జరిగే వరకూ కొట్లాడే న్యాయవాదులు ఈ సమాజానికి ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆదినాథ్, జోగు రవి, దినేష్ మటోలియ, విజయ్, ముకుంద్, రత్నాకర్ రెడ్డి, చిలుకూరి జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి



నవతెలంగాణ-తలమడుగు

నాలుగు సంవత్సరాలుగా గ్రామపంచాయతీల్లో జూనియర్ కార్యదర్శులుగా విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, అనిల్‌రెడ్డి కోరారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నాలుగేండ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో పాటు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరే విధంగా ఎంతో కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జూనియర్ గ్రామపంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో దిలీప్ కుమార్, మండల సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కుభీర్ : ఎంపీడీఓ కదిరాజ్‌కు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు విజయ్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నాలుగు సంవత్సరాల కాలం పూర్తి చేస్తే రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రొబేషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహినుద్దీన్, మాజీ జడ్పీటీసీ శంకర్ చవాన్, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు తోట సంజు, మహేందర్‌సింగ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే రేఖానాయక్



నవతెలంగాణ-సిరికొండ

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం కార్యకర్తలతో విడిగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యకర్తలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేదని పరిష్కరించాలని కోరారు. త్వరలోనే నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉదయం బోథ్ నియోజకవర్గానికి చెందిన కళ్యాణలక్ష్మి చెక్కులను స్థానిక నాయకులతో కలిసి తహసీల్దార్ ఎస్తేర్ వర్ష పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శంకర్ నాయక్, సర్పంచ్ నర్మద, ఎంపీటీసీ పర్వీన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాలాజీ, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు ఒరగంటి పెంటన్న, ఇక్బాల్, గొర్ల రాజన్న, తోకల చందు, షేక్ బషీర్, రాజారాం, విజయ్ కుమార్, సునీల్ కుమార్, బిక్కు, లచ్చిరాం, భీంరావ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ వాల్‌పోస్టర్ల విడుదల



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

దేశానికే దశ దిశ చూపిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని, అన్ని వర్గాల ప్రజల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. బుధవారం జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు దుర్గం శేఖర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని సూచించారు. నిర్వహణ వివరాలను జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు దుర్గం శేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కమిటీ గౌరవ అధ్యక్షులు మేకల మల్లన్న, బాబాసాహెబ్ కంబ్లె, మల్యాల స్వామి, కోకన్వీనర్లు శైలందర్ వాగ్మారే, శాలిక్ రావు నగరాడే, రత్నజాడే , సోగల సుదర్శన్, రాంచందర్ మహాత్మే, శోభాబాయి, బండారి రవీందర్, జాడి రాజారెడ్డి, బిసి సంఘ అధ్యక్షులు చిక్కలా దత్తు, టీఎన్జీవో అధ్యక్షులు అశోక్, బాలశంకర్ కృష్ణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

16న ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-నార్నూర్

ఈ నెల 16న ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాల కోసం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చినప్పరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తరగతి కోసం 16న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతిలో ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్షలు ఉంటాయని వెల్లడించారు. వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మే 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరాల నిర్వహణకు ఆసక్తిగల వారు స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ శిబిరం నిర్వహించే వారికి రూ.4వేల గౌరవ వేతనం, క్రీడా సామగ్రి, పాల్గొన్న క్రీడాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిబిరాల నిర్వహణపై ఆసక్తిగలవారు క్రీడాంశాలు, ప్రదేశం తదితర వివరాలను 9440948409, 9494956454 నెంబర్లకు తెలిపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

నూతన సీఐని కలిసిన పాత్రికేయులు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

సోన్ పరిధిలో నూతనంగా నియమితులైన సిఐ నవీన్‌కుమార్‌ను బుధవారం మండల పాత్రికేయులు మర్యాదపూర్వకంగా కలిశారు. సిఐకి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు గోలి గంగాధర్, గుడిసె రాజేందర్, జెడ్డి మహేష్, గుజ్జరి ఈశ్వర్, వెంకటేశ్వర్ రాజు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన సెక్టోరియల్ అధికారి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను జిల్లా సెక్టోరియల్ అధికారి కంటే నర్సయ్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక స్థాయి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఆరో తరగతి నుండి 9వ తరగతి విద్యార్థుల వార్షిక పరీక్ష నిర్వహణను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాయితీ బస్ పాస్‌లు అందజేత



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని వడ్యాల్ గ్రామంలో బుధవారం ఆర్‌టిసి నిర్మల్ డిపో ఆధ్వర్యంలో బస్ పాస్ మేళా నిర్వహించారు. అర్హులైన దివ్యాంగులకు బస్సు చార్జీలో 50 శాతం రాయితీతో కూడిన బస్ పాసులు డిపో మేనేజర్ సాయన్న పంపిణీ చేశారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులలో సగం ధరకే ప్రయాణించొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది లక్క నర్సయ్య, టివి.రమణ, గ్రామ సర్పంచ్ అట్ల లలిత రాంరెడ్డి, కూన రాములు, నర్సిములు పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు తేజావత్ రాంబాబు ఆధ్వర్యంలో ఆర్కే ఓసీపీ గని పై బుధవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తేజావత్ రాంబాబు మాట్లాడుతూ ఈ నెల 17,18 తేదీలలో జేబీసీసీఐ సమావేశంలో ఐఎన్టీయూసీ యూనియన్ సమర్పించబోయే డిమాండ్ల పై జనక్ ప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. అలాగే ఈ నెల14వ తేదీన నస్పూర్ సీసీసీలో నిర్వహించే సత్యాగ్రహ సభకు కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం అరకొండ శేఖర్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఐఎన్టీయూసీ సెంట్రల్ సెక్రటరీగా నియమించినందుకు గాను జనక్ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహరెడ్డి, త్యాగారాజన్, ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, ఆర్.నరేందర్ పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగ పర్చుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కంటివెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి రామకృష్ణ సూచించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని వైద్య శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేయించుకోవడం వల్ల సమస్య తీవ్రత పెరిగే అవకాశం లేకుండా పోతుందన్నారు. ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన శిబిరం ద్వారా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలతో పాటు సాధారణ సమస్యకు కండ్ల అద్దాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సామాజిక వైద్యశాల సూపరింటెండెంట్, డా.స్వామి, డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డా.సుధాకర్ నాయక్, జిల్లా కంటివెలుగు శిబిరాల క్వాలిటీ కంట్రోల్ అధికారిణి డా.రాధిక, నిర్వహణ వైద్యాధికారిని డా.సువర్ణ, క్యాంప్ కోఆర్డినేటర్ శ్యాంలాల్ పాల్గొన్నారు.

నియోజకవర్గానికి 1500 రంజాన్ కిట్లు

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రంజాన్ పండుగను పురస్కరించుకుని నియోజకవర్గానికి 1500 చొప్పున రంజాన్ కిట్లను మైనారిటీ లకు అందజేయడం జరుగుతుందని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి ముస్లిం మత పెద్దలతో ఇఫ్తార్ విందు, రంజాన్ కిట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగను అందరూ కలిసిమెలిసి సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. రంజాన్ సందర్భంగా ఆసిఫాబాద్ నియోజకవర్గానికి 1 వేయి 500 కానుకల కిట్లను కేటాయించడం జరిగిందని, ముస్లిం మత పెద్దలు కమిటీగా ఏర్పడి నియోజకవర్గంలోని మండలాల వారీగా కానుకల కిట్లను పంపిణీ చేసేందుకు కార్యచరణ రూపొందించుకోవాలని, స్థానిక శాసనసభ్యుల సమన్వయంతో పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని మైనారిటీ శాఖ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. అర్హులైన పేదలకు కానుకలు అందే విధంగా మత పెద్దలు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, ఇఫ్తార్ విందు ప్రదేశాలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి షేక్ మహమూద్ పాల్గొన్నారు.

గుండెపోటుతో గల్ఫ్‌లో వ్యక్తి మృతి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన నందుల శివకుమార్(42) నాలుగు సంవత్సరాల క్రితం అబుదాబి, దేశానికి బతుకుదెరువు కోసం వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడని అతని భార్య శోభ తెలిపారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అతనికి చింతా గుడా గ్రామంలో ఉండడానికి ఇల్లు కూడా లేని నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని భార్య శోభ వేడుకుంటున్నారు. భర్త శివకుమార్ శవాన్ని త్వరగా స్వగ్రామానికి తేవడానికి ప్రభుత్వ అధికారులు కృషి చేయాలని కోరుతున్నామన్నారు..

చిన్నారి వైద్యానికి సీఎంఆర్ఎఫ్ అందజేత



నవతెలంగాణ-జన్నారం

జన్నారం గ్రామానికి చెందిన చిన్నారి వైద్యానికి ఎమ్మెల్యే రేఖా శ్యామ్ నాయక్ సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదిత కుటుంబానికి బుధవారం అందజేశారు. ఆ గ్రామానికి చెందిన యట రాజన్న కుమార్తె స్వాతి అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఆమె వైద్యానికి రూ.5లక్షలు అవసరమని వైద్యులు తెలిపారు. ఉపసర్పంచ్ జంగం రవి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో రాజన్నకు ఎంజూరైన రూ.5 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును శాంక్షన్ లెటర్ ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు ఎమ్మెల్యే రేఖా నాయక్ జన్నారం ఉపసర్పంచ్ జంగం రవికి కృతజ్ఞతలు తెలిపారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ప్రభుత్వ నిబంధనలను అనుసరించి నియామకమై నాలుగేండ్ల ప్రొబేషన్ పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. జేపీఎస్‌ల నాలుగు సంవత్సరాల ప్రొబేషన్ పూర్తైన సందర్భంగా బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకు నోటిఫికేషన్ ద్వారా నియామకం అయిన ఏ ఉద్యోగికి లేని విధంగా నోటిఫికేషన్‌లో మూడేండ్ల ప్రొబేషన్ విధించారన్నారు. 3 ఏండ్ల అనంతరం రెగ్యులరైజేషన్ చేయాల్సి ఉండగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రొబేషన్ కాలాన్ని మరో ఏడాది పాటు పొడిగించి నాలుగేండ్ల తర్వాత రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించడం జరిగిందని గుర్తు చేశారు. ప్రభుత్వ సూచన మేరకు ఏప్రిల్ 12తో నాలుగేళ్ల ప్రొబేషన్ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేశామన్నారు. వెంటనే తమ న్యాయమైన హక్కును గుర్తించి గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శులుగా ఈ 4 సంవత్సరాల కాలాన్ని సర్వీస్ తో కూడిన రేగ్యులరైజేషన్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. ఓపీఎస్ వ్యవస్థను రద్దు చేసి జేపీఎస్‌లుగా గుర్తించి ప్రొబిషన్ పూర్తి కాగానే వాళ్ళని సైతం రేగ్యులర్ చేయాలని కోరారు. ప్రభుత్వం రెగ్యులరైజేషన్ ప్రకటన చేయనట్లయితే రాష్ట్రవ్యాప్తంగా టీఎస్పీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో రెగ్యులర్ అయ్యేంత వరకు నిరవధిక సమ్మెకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు జాడి శ్రీకాంత్, ప్రసాద్, రాజేశ్వరి, సుష్మిత, సుమలత, ఆకాశ్, కరుణశ్రీ, ఛాయా, సులోచన, ఓపీఎస్‌లు విలాస్, హరీష్, రమేష్, వాజిద్, సలీమ్ పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్ కార్మికులపై సీపీకి ఫిర్యాదు

- యాజమాన్య తీరుపై కార్మికుల ఆగ్రహం



నవతెలంగాణ-మంచిర్యాల

పవర్ ప్లాంట్ కార్మికులు చేపట్టిన దీక్షపై యాజమాన్యం మొండి వైఖరి విడడం లేదు. కార్మికుల దీక్షపై యాజమాన్యం బుధవారం రామగుండం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. యాజమాన్యం అనుసరించిన తీరుపై కార్మికులు మండిపడుతున్నారు. డిమాండ్ల సాధన కోసం న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. శాలివాహన పవర్ ప్లాంట్ కార్మికులకు రావలసిన పెండింగ్ వేతనాలు, బోనసులు ఇప్పించాలని గత మూడు రోజులుగా శాలివాహన పవర్ ప్లాంట్ ఆవరణలో కార్మికులు శాంతియుత నిరాహార దీక్ష చేపట్టారు. ఈ తరుణంలో శాలివాహన పవర్ ప్లాంట్, డైరెక్టర్ మల్కా నవీన్ కుమార్ ఏప్రిల్ 12వ తేదీన కార్మికులకు రావాల్సిన వేతనాలు, బోనసులు చెల్లించుట కొరకై మంచిర్యాలకు వచ్చి కార్మికులతో చర్చలు జరుపుతానని మోసపూరిత వాగ్దానాలు చేసి, చివరకు కార్మికులపై చర్యలు తీసుకోవాలంటు రామగుండం పోలీస్ కమిషనర్ ఫిర్యాదు చేసినట్లు కార్మిక సంఘం నాయకులు తెలిపారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి కార్మిక సంఘాల నాయకులను పిలిపించి ఏప్రిల్ 15వ తేదిన సీపీ కార్యాలయంలో హాజరు కావాలని తెలిపారు. కార్మికులు గత నాలుగు నెలలుగా పెండింగ్లో ఉన్న వేతనాలు, బోనసులు ఇప్పించాలనీ, శాంతియుతంగా పోరాటం చేసిన కూడా కార్మికులపై కనికరం చూపించకుండా కక్ష సాధింపులకు పూనుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అదేవిధంగా యాజమాన్యం ఎన్ని విధాలుగా కార్మికులను అణగదొక్కే ప్రయత్నం చేసిన వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కార్మికులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ఇ.ఉమేష్‌రావు, కుంటాల శంకర్, గోమాత ప్రకాష్, ఎస్.సత్యనారాయణ, ఆసరి రాజయ్య, ఎడ్ల శ్రీనివాస్, కాయితి శ్రీనివాస్, పెంట సత్యం, ఈసారపు శంకర్ పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



నవతెలంగాణ-తాండూర్

చదువుతోటే సమాజంలో గుర్తింపు లభిస్తుందని విద్యార్థులు చదువుకొని మంచి భవిష్యత్తును రూపొందించుకోవాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం మండలంలోని రేచీని గ్రామంలో మన ఊరు-మనబడి ప్రణాళిక ద్వారా చేపట్టిన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు గాను అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అందులో భాగంగానే మన ఊరు-మన బడి ప్రణాళిక ద్వారా పాఠశాల భవనాల నిర్మాణం పాఠశాలల ఆధునీకరణ నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఎంపిక చేయబడిన పాఠశాలల్లో అత్యున్నతమైన సౌకర్యాలు ఏర్పాటు చేయడం అదనపు గదుల నిర్మాణం కిచన్ షెడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రభుత్వం విద్యా సౌకర్యాలు చేకూర్చడంలో ముందుందని తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో ఏడు గురుకులాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ గురుకులాల్లో చదివిన విద్యార్థులు గుర్తింపు పొందిన యూనివర్సిటీలో సీట్లు సంపాదించి ఉద్యోగాల్లో స్థిరపడ్డారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా [illegible] కాలేజీలను ఏర్పాటుచేసి ఉన్నత విద్యా సౌకర్యాలను పెంపొందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం ఆరోగ్యం మహిళా పేరున మహిళలకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి పెద్ద ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నావని తెలిపారు. రక్తహీనత కలవారికి న్యూట్రిషన్ కిట్లను అందజేస్తున్నమని తెలిపారు. రైతుబంధు రైతు బీమా ఉచిత విద్యుత్తు వంటి పథకాలు రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేయబడినవని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మతసామరస్యాన్ని కాపాడేందుకు రంజాన్, క్రిస్మస్, దసరా సంబరాల్లో మహిళలకు బట్టలు పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దత్తు మూర్తి, రేచిని సర్పంచ్ చింతపురి దుర్గ బాయి, ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్, జడ్పీటీసీ బానయ్య సీనియర్ నాయకులు పురుషోత్తం గౌడ్, ఎంపీటీసీ మొగిలి శంకర్, సిరంగి శంకర్, పేరెంట్ కమిటీ అధ్యక్షులు వేముల లావణ్య, మార్కెట్ డైరెక్టర్ సంతోష్ కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

స్పష్టమైన ఫొటో ఓటరు జాబితా రూపొందించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

స్పష్టమైన ఫోటో ఓటరు జాబితా రూపొందించేందుకు కార్యచరణ తయారు చేసి పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్‌డీఓలతో ఫోటో ఓటరు జాబితా రూపొందించడంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలు లేకుండా స్పష్టమైన ఫోటో ఓటరు జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాబితా నుండి ఓటర్ వివరాలను తొలగించేందుకు ఫారం 7 ద్వారా దరఖాస్తును పూర్తి చేసి క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులతో పరిశీలన జరిపి వివరాలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, డూప్లికేట్ ఓటరు కార్డు కలిగిన వారికి నోటీసులు జారీ చేసి తొలగింపు చర్యలు చేపట్టాలని, 2 లేదా ఎక్కువ ప్రదేశాలలో నమోదు ఉన్న ఓటరు వివరాలను ఒకే దగ్గర ఉంచి మిగతా చోట్ల తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మరణించినా, చిరునామా మారిన వారి వివరాలను విచారించి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నూతన ఓటరు నమోదు, సవరణకు ఫారం 6, 7, 8 ఫారముల ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారుల సమన్వయంతో విచారణ జరిపి ఎలాంటి తప్పులు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా తయారీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరు నమోదు, సవరణ కొరకు వచ్చిన దరఖాస్తులను ఆయా మండలాల తహసీల్దార్లు, ఉపతహసీల్దార్లు, సంబంధిత అధికారులతో దరఖాస్తులను పరిశీలించి ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా తయారీకి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం, ఆర్‌డీఓ రాజేశ్వర్ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీని గుడిపేట్‌లో ఏర్పాటు చేయాలి

- ఎంపీపీ మందపల్లి స్వర్ణలత శ్రీనివాస్

నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని గుడిపేట్‌లోనే మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని ఎంపీపీ మందపల్లి స్వర్ణలత కోరారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఆయా శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీటీసీలు మండలంలోనే మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. వినతి పత్రాన్ని ఎంపీపీ, ఎంపీడీఓలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మెడికల్ కాలేజీ ఏర్పాటుకు మండలంలోని గుడిపేట్ శివారులో 32 ఎకరాల ప్రభుత్వ భూమి అనుకూలంగా ఉందన్నారు. ఇక్కడ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తే ప్రాంతం మండలం అభివృద్ధి చెందుతుందని, కొందరికి ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోతామన్నారు. మండలంలోనే ఏర్పాటుకు కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని తీర్మానం చేసి ఎంపీడీఓకు అందజేశారు. మండల వైద్యాధికారి లహరి ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పుస్కురి శిల్ప, ఎంపీడీఓ అబ్దుల్ హై, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, ఏఓ రజిత పాల్గొన్నారు.



అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని ఆసిఫాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిప్ప సురేష్ కోరారు. కలెక్టర్ హేమంత్ బొర్కాడేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు మంజూరు చేయాలన్నారు. గతంలో కొంతమందికి ఇండ్ల స్థలాలు ఇచ్చారని ఇంకా కొంతమంది మిగిలి ఉన్నారని వారికి వెంటనే స్థలాలు కేటాయించాలని కోరారు. జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్‌కు స్థలం ఉన్నప్పటికీ భవనం లేకపోవడంతో కార్యకలాపాలకు ఇబ్బంది అవుతుందని భవనం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఆడ్లూరి కృష్ణంరాజు, ఉపాధ్యక్షులు దేవునూరి రమేష్, వారణాసి శ్రీనివాస్, మసాదే సంతోష్ కుమార్, కార్యదర్శులు ఆడప సతీష్, వెంకట్ గౌడ్, రవి, ప్రచార కార్యదర్శి చీల నితీష్, సురేష్ చారి, సలహాదారులు వేణుగోపాల్, మహేష్, సభ్యులు హన్నాన్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ బహిరంగ సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-జన్నారం

అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14న కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ కేంద్రంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శి పసియుల్లా అన్నారు.బుధవారం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన పత్రిక విలేకరులతో మాట్లాడుతూ ఈ భారీ బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే హాజరవుతున్నట్టు తెలిపారు. రాహుల్ గాంధీ పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేసిన కుట్రను ప్రజలకు తెలియజేయడానికే ఈ సభ ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు.. విద్యార్థులు, యువకులు, కార్మికులు ఆత్మబలిదానాల వల్ల సాధించుకున్న తెలంగాణలో నేడు వివిధ రంగాలను ప్రైవేటుపరం చేశారన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగాలు అంగట్లో పెట్టి అమ్ముకున్నారని ఆరోపించారు. సింగరేణి కంపెనీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్ పరం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు ముత్యం రాజన్న, పట్టణ అధ్యక్షులు ధూమల రమేష్, రేండ్లగూడ ఎంపీటీసీ కరుణాకర్, వార్డు మెంబర్ గంగన్న యాదవ్, మండల ప్రచార కార్యదర్శి ఎండీ అజహర్, ఎస్ఎస్ఎల్ అధ్యక్షులు మామిడిపల్లి ఇందయ్యా, రేండ్ల గూడ గ్రామ అధ్యక్షుడు అల్లం పెద్దయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఇమ్రాన్, ప్రవీణ్, ప్రశాంత్, ఎన్ఎస్‌యూఐ నాయకులు సోహెల్, అజ్మత్ పాల్గొన్నారు

సభా ప్రాంగణం ఏర్పాట్లను పరిశీలించిన హనుమంతరావు



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నస్పూర్ కలెక్టరేట్ ఎదుటగల మైదానంలో ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా డీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభ స్థలాన్ని మాజీ పీసీసీ హన్మత్‌రావు బుధవారం పరిశీలించారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరితో కలిసి సభ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో, కేంద్రంలో రాచరిక పరిపాలన కొనసాగిస్తున్నారని, ప్రజల కోసం ఈ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను ఎండగడతామని తెలిపారు.

రెండవ విడత గొర్రెల పంపిణీపై అవగాహన



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యాదవులకు రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని లింగయ్యపల్లే గ్రామ పంచాయితీలో మండల పశువైద్యాధికారి డాక్టర్ కస్తూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో యాదవులకు, అవసరం అయిన డాక్యుమెంట్స్, అప్లోడింగ్, డీడీలు కట్టడం, సొసైటీ కార్యక్రమాలు, ఎండాకాలంలో పశువులు, గొర్రెల కాపారులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు.

అంబేద్కర్ జయంతిని ఘనంగా జరుపుకోవాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 132వ జయంతిని ఘనంగా నిర్వహించాలని అంబేద్కర్ సంఘం నాయకులు విజయ్, విలాస్, రోశన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో ఉదయం పంచశీల జెండా ఆవిష్కరించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం శాంతియుత ర్యాలీతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగతుందన్నారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థ నాయకులు, స్థానికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేటి నిరుద్యోగ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉట్నూర్‌లోని వైటీసీలో గురువారం నిర్వహించే జాబ్ మేళను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6 వివిధ రకాల కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటున్నాయని నిరుద్యోగ అభ్యర్థులు వారికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో జాబ్ మేళాకు హాజరుకావాలని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. 18 నుండి 35 సంవత్సరాల లోపు యువతీ యువకులు అర్హులని ఇతర వివరాల కోసం 9493535052, 7893616392, 9666748105 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
4
గురువారం 13 ఏప్రిల్ 2023

సీఓఈ సెట్ ఫలితాల్లో బెల్లంపల్లి సీఓఈకి 12 సీట్లు

నవతెలంగాణ-తాండూర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న సైనిక్ స్కూల్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం వేరువేరుగా నిర్వహించిన సిఓఈ సెట్-2023 ఫలితాల్లో బెల్లపల్లి సీఓఈ విద్యార్థులు 12 మంది సీట్లు సాధించినట్టు ప్రిన్సిపాల్ అయినాల సైదులు తెలిపారు. గురుకులంలో ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న 65 మంది విద్యార్థులు ఈ సెట్‌లకు హాజరు కాగా వారిలో 12 మంది విద్యార్థులు సీట్లు సాధించారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ పరీక్షల్లో సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్‌లో ముగ్గురు విద్యార్థులు, ఐఐటి నీట్ శిక్షణ కేంద్రాలైన సీఓఈలలో 9 మంది విద్యార్థులు కలిపి మొత్తం 12 మంది సీట్లు సాధించినట్లు పేర్కొన్నారు.

మండల అభివృద్ధిపై సమీక్ష

నవతెలంగాణ తాండూర్

మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలలో పనిచేసే ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని, హాజరు మధ్య తేడా ఎక్కువగా ఉండకుండా చూడాలని తెలిపారు. కూలీలకు రూ.275 వేతనం తగ్గకుండా చూడాలని తెలిపారు. గ్రామ పంచాయతీలలో మిగిలి ఉన్న క్రీడా ప్రాంగణాలను పూర్తి చేయాలని, పూర్తి అయిన క్రీడా ప్రాంగణాలను వాడకంలోకి తేవాలని ఆదేశించారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో నర్సరీలనుపనులను వేగవంతం చేయాలన్నారు. వైకుంఠ ధామంలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసేందుకు మీసేవ నందు డిడి కట్టలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీఓ సత్యనారాయణ, ఏపీఓ నందకుమార్ సత్యనారాయణ పాల్గొన్నారు

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఖానాపూర్

కంటి వెలుగును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. బుధవారం ఖానాపూర్ మున్సిపాలిటీలోని 10వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు.

ఆదిలాబాద్‌అర్బన్ : అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగును పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ సూచించారు. బుధవారం స్థానిక 34వ వార్డు పరిధిలోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రెండవ విడత కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వేసవికాలం నేపథ్యంలో శిబిరానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కంటి పరిక్షల తీరును పర్యవేక్షించి పలువురికి కళ్ళద్దాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ మాట్లాడుతూ ప్రజల కంటి సమస్యలను దూరం చేయడమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. కంటి పరిక్షలు జరిపిన అనంతరం అవసరమైన వారికి మందులను, కండ్లద్దాలను అందచేస్తున్నట్లు వివరించారు.

బూత్ స్వశక్తీకరణ సమ్మేళనం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని కిమ్స్ హాస్పిటల్ హాల్‌లో బుధవారం బీజేపీ బూత్ స్వశక్తీ కరణ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉమ్మడి ఆదిలాబాద్ బూత్ స్వశక్తి కరణ ఇన్‌ఛార్జి యువ మోర్చా జాతీయ నాయకులు సోలంకి శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి అల్జపూర్ శ్రీనివాస్, ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమన్న జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ కో కన్వీనర్ కోలిపాక కిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్నక్ విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెర్లా మురళీ, సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ వీరభద్ర చారి, ఆసిఫాబాద్ నియోజక వర్గ కన్వీనర్ సొల్లు లక్ష్మి, కోకన్వీనర్ సారా రమేష్ గౌడ్, బూత్ స్వశక్తి కరణ స్వశక్తీకరణ జిల్లా కోఆర్డినేటర్ లోయ, మందాడే సుధాకర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు చప్పిడి సత్యనారాయణ, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి దుర్గం విశాల్, ఆదిలాబాద్ పార్లమెంట్ విస్తరక్ రవి, సిర్పూర్ నియోజకవర్గం విస్తారక్ తిరుపతి పాల్గొన్నారు.

సమిష్టిగా అంబేద్కర్ జయంతి నిర్వహించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలను పార్టీలకు అతీతంగా సమిష్టిగా నిర్వహించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. బుధవారం తన నివాసంలో తనను కలిసిన జయంతి ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో 14న డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అతిథిగా తనను ఆహ్వానించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అంబేద్కర్ ఒక వర్గానికో, ఒక కులానికో చెందిన వాడు కాదని ఆయన యావత్ భారతావనికి మార్గదర్శనం చేసిన మహనీయుడు అని అన్నారు. ఆయన రచించిన రాజ్యాంగం వల్ల నేడు స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు జీవిస్తున్నారని అన్నారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కూడా ఈ నెల 13, 14వ తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని తమకు పార్టీ అధిష్టానం నుంచి ఆదేశాలు అందాయన్నారు. ఆ ప్రకారంగా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, నాయకులు ఈనెల 14న ఊరూరా, వీధి వీధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించునున్నామని తెలిపారు.

మైనార్టీ సంక్షేమనికి ప్రభుత్వం పెద్ద పిట

- ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్

నవతెలంగాణ-ఖానాపూర్

మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్ద పిట వేస్తోందని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. బుధవారం ఖానాపూర్ పట్టణంలో ఈద్గా నిర్మాణానికి ప్రభుత్వం 2 ఎకరాల భూమిని కేటాయించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమి కేటాయించిన సందర్భంగా ఎమ్మెల్యేను ముస్లిం నాయకులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని వీర్దండి గ్రామంలో ఉపాధి హామీ చట్టం ద్వారా మంజూరైన రోడ్డుకు బుధవారం సర్పంచ్ మడావి రేణుక భూమిపూజ చేశారు. దుర్గం సుధాకర్ చేను నుండి మైసమ్మ కుంట వరకు ఈ రోడ్డు వేయనున్నట్టు ఆమె తెలిపారు. పంట పొలాలకు వెళ్లడానికి రైతులకు ఇబ్బంది కాకుండా ఈ రోడ్డు వేయిస్తున్నట్టు పేర్కొన్నారు.

మురళీగూడలో ఆరోగ్య శిబిరం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని మురళీగూడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా 58 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 26 మంది రక్త నమూనాలను సేకరించినట్టు హెల్త్ అసిస్టెంట్ ధర్మారావు తెలిపారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ మాధురి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపకరణాల కోసం వికలాంగుల నుండి దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

12 రకాల వేర్వేరు వికలాంగత్వంతో బాధపడుతున్న వికలాంగుల నుండి ఉపకారణాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వికలాంగ సంక్షేమ శాఖ అధికారిణి సావిత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత ఉండి ఆసక్తి కలిగిన వారు ఈనెల 25లోపు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 155326ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఐకేపీ వీఓఏలను

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల డిమాండ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో ఐకేపీ వీఓఎల సమస్యలపై వివిధ ప్రజా సంఘాల నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని, రూ.10 లక్షల సాధారణ భీమా ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఆన్‌లైన్ పనులు రద్దు చేయాలని, సెర్ప్ నుంచి ఐడి కార్డులు ఇవ్వాలన్నారు. యూనిఫాం ఇవ్వాలని, మహిళా సంఘాల సభ్యులకు రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. మహిళా సంఘాలకు అభయహస్తం డబ్బులు అందరికీ తిరిగి ఇవ్వాలన్నారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఏప్రిల్ 17వ తేదీన నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అల్లూరి లోకేష్, మేరా సంఘం జిల్లా నాయకులు రాపర్తి మురళీ, లుంబిని దీక్ష భూమి అధ్యక్షులు జాడే బాపు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, నాయకులు సునీత, బుద్దు, రమ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్ పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు సహకరించొద్దు

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత ప్రజల అభివృద్ధి, సంక్షేమమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యం అని, ప్రజలు అసాంఘిక శక్తులకు సహకరించవద్దని ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. మండలంలోని మాలిని గ్రామ పంచాయతీ పరిధిలోని మాణిక్ పటార్ గ్రామాన్ని బుధవారం సందర్శించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా బియ్యం, నిత్యావసర సరుకులు, మహిళలకు చీరలు, యువతకు వాలీబాల్ కిట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత, ప్రజలు మావోయిస్టుల ప్రలోభాలకు లోనూ కావద్దని, వారికి సహకరించవద్దని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తుల మాయమాటలు నమ్మవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సహకరిస్తారని తెలిపారు. ప్రజలకు ఏ సమస్యలున్నా ప్రభుత్వం, పోలీసుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. యువత మావోయిస్టులకు ఆకర్షితులు కావద్దని, ఉన్నత చదువులు చదవాలని, ప్రభుత్వం జిల్లాలో ఉచిత విద్య, ఉచిత హాస్టల్ సదుపాయం కల్పించిందని, వాటిని ఉపయోగించుకోవాలని అన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, పిల్లలు, యువతను వారి తల్లితండ్రులు చదివించాలని సూచించారు. గ్రామంలో నిషేధిత గంజాయి సాగును పండించవద్దని అన్నారు. గ్రామస్థులు ఎస్పీకి పలు సమస్యలు విన్నవించగా పోలీసులు మీకోసం కార్యక్రమం ద్వారా జిల్లాలో, గిరిజన ప్రాంతాల్లో ఎన్నో సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సమస్యలు కలెక్టర్‌తో చర్చించి పరస్పర సహకారంతో సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్ వల్ల ప్రతీ మారుమూల ప్రాంతాల్లో పోలిసులు అందుబాటులో ఉంటున్నారని, అపరిచిత వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ అచ్చేశ్వరరావు, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, కౌటాల సీఐ సాదిక్ పాషా, కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా పాల్గొన్నారు.

బైక్‌పై మణిక్‌పటార్‌కు ఎస్పీ

జిల్లాలోనే అత్యంత మారుమూల ప్రాంతమైన మాణిక్ పాటర్ గ్రామానికి వెళ్ళేందుకు సరైన్ రోడ్డు సదుపాయంలేదు. దీంతో జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ సుమారు 8 కిలోమీటర్లు బైక్ పై పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ప్రయాణం చేశారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజేషన్ చేయాలి

- మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

నవతెలంగాణ-హాజీపూర్

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలని మండల జేపీఎస్‌లు కోరారు. సమస్యల పరిష్కరించాలని ఎంపీపీ, ఎంపీడీఓలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేపీఎస్‌లు మాట్లాడుతూ రెగ్యులర్ చేస్తూ 4 సంవత్సరాల ప్రొబిషనరీ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలన్నారు. ఔట్ సోర్సింగ్ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా పరిగణించాలని కోరారు. కార్యక్రమంలో పీ.మల్లేష్, రాజేష్, ఉదయ్ కుమార్, శ్రీనివాస్, గణేష్, ప్రతిభ, రాజమని పాల్గొన్నారు.

జన్నారం : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల 4 సంవత్సరాల ప్రొబేషనరీ కాలం పూర్తైన సందర్భంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కార్యదర్శులు బుధవారం ఎంపీపీ మాదాడి సరోజన జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ అన్ని ఇవ్వాలన్నారు. లేనియెడల ఈ నెల 28 నుండి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 29 గ్రామపంచాలకు చెందిన కార్యదర్శులు, వైస్ ఎంపీపీ వినయ్ కుమార్ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు గంగాధర్ ఎంపీటీసీల పురం జిల్లా అధ్యక్షుడు రియాజుద్దీన్, ఏపీఓ రవీందర్ పాల్గొన్నారు.



హాజీపూర్



జన్నారం

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 125 అడుగుల డా.బీ.ఆర్.అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాబా సాహెబ్ డా.బీ.ఆర్.అంబెద్కర్ జయంతి వేడుక, ఉపాధి హామీ పథకం, మిషన్ భగీరథ, తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 14 న హైదరాబాదులో 125 అడుగుల అంబెద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారని, ఈ కార్యక్రమానికి జిల్లా నుండి 15 బస్సులు బయలుదేరనున్నాయని తెలిపారు. ఆయా మండల కేంద్రాల నుంచి ఉదయం 6 గంటలకు బస్సులు బయలుదేరేవిధంగా, అలాగే కార్యక్రమ అనంతరం తిరిగి యధావిధిగా గమ్యస్థానాలకు చేర్చేవిధంగా సంబంధిత అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రతి బస్సులో ప్రత్యేక అధికారితో పాటు కానిస్టేబుల్, హెల్త్ అసిస్టెంట్, ఇద్దరు సహాయ సిబ్బందిని నియమించడం జరిగిందని, త్రాగునీరు, అల్పాహారం, భోజనం అందేలా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తీ చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని, జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి వందరోజుల పనిదినాలు కల్పించాలని సూచించారు. వేసవి దృష్ట్యా ప్రతి నర్సరీలలో మొక్కలకు నీరు అందించాలని, గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వేసవిలో త్రాగునీరు ఇబ్బందులు తలెత్తకుండా మిషన్ భగీరథ త్రాగునీరు ప్రతి ఇంటికి చేరేలా పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పైపులైన్ లో లీకేజీలు ఉన్న చోట వెంటనే మరమ్మత్తులు చేపట్టి నీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకుముందు మండలాల వారిగా ఆయా పనుల పురోగతిపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమీక్షించారు. ఈ సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, డీపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ కిషన్, జడ్పీ సీఈఓ గణపతి, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి సునీతకుమారి, ఈడీ శంకర్ పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 132 జయంతిని పురస్కరించుకుని జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ కనక యాదవ్ రావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనం ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో కవులు ఇందరపు మధుకర్ శర్మ, చిలుకూరి రాధాకృష్ణ చారి, శ్రీరామ్ సత్యనారాయణ, ఢిల్లీ విజయ్ కుమార్, వైద్య పూర్ణచందర్, కిల్లి వెంకట్రావు, డి.వివేక్, కవితగానం చేశారు. గ్రంథలయ సిబ్బంది ఎం.వెంకటరమణ, జి.సతీదేవి, బి.సదానందం, మజీద్, సలీం, రామయ్య పాల్గొన్నారు.

సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం గర్వకారణం



నవతెలంగాణ-కాసిపేట

సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం గర్వకారణమని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం మండలంలోని కోమటిచేను గ్రామ బస్‌స్టాండ్ వద్ద గ్రామస్తులు ఏర్పాటు చేసిన అంబెద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత దేశంలోనే ఎతైన అంబేద్కర్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ ఏర్పాటు చేయటం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అందరి కంటే ఎక్కువ అంబేద్కర్ విగ్రహాలు ఉన్నట్లు పేర్కొన్నారు. జ్ఞానవంతుడు కనుకనే ఈ రోజు ప్రపంచమంతా ఆయన విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే చదువు ఒక్కటే ఏకైక మార్గమని తెలిపారు. ప్రతి ఒక్కరు పిల్లలను చదివిస్తే నే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రభుత్వం విదేశాల్లో చదువేందుకు రూ.20 లక్షల స్కాలర్ షిప్ కూడా అందజేస్తుందన్నారు. గూడు లేని పేదలకు కూడా మరో పదిహేను రోజుల్లో గృహనిర్మాణానికి రూ.3 లక్షలు అందజేస్తుందన్నారు. తమ గ్రామానికి సీసీ రోడ్డు మంజూరు చేయాలని కోమటిచేను సర్పంచ్ కోరటంతో త్వరలోనే రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామిఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, వైస్ ఎంపీపీ విక్రమ్ రావు, రైతు సమితి మండల అధ్యక్షుడు దుర్గం పాశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, సర్పంచ్ రమాటేంకి శ్రీనివాస్, ఎంపీటీసీ చంద్రమౌళి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మంజులరెడ్డి, వాసుదేవ్, సర్పంచ్‌లు స్వప్న, విజయ, ఉపసర్పంచ్ సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

ఫొటో ఓటరు జాబితాకు కార్యాచరణ రూపొందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

స్పష్టమైన ఫోటో ఓటరు జాబితా రూపొందించేందుకు కార్యచరణ తయారు చేసి చర్యలు తీసుకుంటున్నామని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ హైదరాబాద్ నుండి ఉన్నత అధికారులతో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ఫోటో ఓటరు జాబితా రూపకల్పనపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆదిలాబాదు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతన ఓటరు నమోదు, సవరణ కొరకు ఫారం 6, 7, 8 ఫారముల ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారుల సమన్వయంతో విచారణ జరిపి ఎలాంటి తప్పులు లేకుండా ఆయా మండలాల తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో పరిశీలించి ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా తయారీకి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డూప్లికేట్ ఓటరు కార్డు కలిగిన వారికి నోటీసులు జారీ చేసి తొలగింపు చర్యలు చేపడుతున్నామని, ఓటర్ వివరాలను తొలగించేందుకు ఫారం-7 ద్వారా దరఖాస్తును పూర్తి చేసి క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులతో పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. రెండు లేదా ఎక్కువ ప్రదేశాలలో నమోదైన ఓటరు వివరాలను ఒకే దగ్గర ఉంచి మిగతా చోట్ల తొలగించేంచేలా, మరణించినా, చిరునామా మారిన వారి వివరాలను విచారించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఎన్. నటరాజ్, రిజ్వాన్ బాషాషేక్, శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీఓలు రమేష్ రాథోడ్, సురేష్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా పాల్గొన్నారు.

5వ పెన్షనర్స్ మహాసభలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలోగల సుదరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 15 , 16వ తేదీలలో నిర్వహించే తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ 5వ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ శశికాంత్ అన్నారు. బుధవారం స్థానిక ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర పెన్షనర్స్ మహా సభల్లో మేధావులు, పెన్షనర్స్, విద్యావంతులు పాల్గొని సమస్యలపై తీర్మానాలు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఆదిలాబాద్ నుండి ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు ఆ సభల్లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఆల్ పెన్షనర్స్ గౌరవాధ్యక్షులు ఎస్.దయాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మాదం గంగాధర్, వెంకట స్వామి, జిల్లా కార్యదర్శులు దిలీప్, జి.దేవిదాస్, సామల రాజవర్ధన్, గోలి రాజన్న, అల్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం జై జవాన్‌నగర్‌కు చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే జోగు రామన్న వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ సంపదను కొల్లగొట్టిన వ్యక్తులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు పలుకుతోందని ఆరోపించారు. సంపదను విదేశాలకు దోచుకెళ్ళిన వారి రూ.19లక్షల కోట్ల రుణాలను మాఫీ చేయడమే అందుకు నిదర్శనమన్నారు. కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారని మండిపడ్డారు. దేవుడి పేరు మీద రాజకీయాలు చేస్తూ బీజేపీ నాయకులు పబ్బం గడుపుకుంటున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాలు నచ్చక అనేక మంది యువకులు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరి తమ మద్దతు తెలుపుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, కో ఆప్షన్ సభ్యులు సంజయ్, నాయకులు గోలి శంకర్, అబ్దుల్ అతీక్ పాల్గొన్నారు.